

వచ్చాడు.

లోకంలోని సమస్తమైనదుఃఖాన్ని, జుగుప్సని, బాధలని, అసమర్థతని, ఇతరములైన (అందరూ అక్కరలేదని ఏకగ్రీవంగా ఆమోదించిన) లక్షణాలన్నీ మూర్తీభవించిన ఒక వింతజాతి సృష్టింపబడింది.

అదే "గుమాస్తా" జాతి. ఇంగ్లీషులో 'క్లర్క్', హిందీలో ... ఏ భాషలో ఏ పేరైనా లక్షణాలు, జీవన పంథా అన్నీ ఒకటే ప్రతి గుమాస్తాకు.

అలాంటి గుమాస్తాను నేను!

నాకింక వేరేపేరు,వూరు లేవు. నేను గుమాస్తాని, నాకు వేరే జీవితం లేదు. "వర్క్ ఈజ్ ది లైఫ్ ఆఫ్ క్లర్క్" జీవితమే వుద్యోగం, ఉద్యోగమే జీవితం. నాకు వుద్యోగ బాధ్యతలు తప్పితే వేరే బాధ్యతలు లేవు (ట!)

కాని నే ననేదేమిటంటే నాకీ వుద్యోగం తప్పింది మరే బాధలు లేవు.

ప్రపంచంలో అందరికీ విరుద్ధమైన, విచిత్రమైన వింతజాతి మాది. అందరిలోనూ ఏరిపారవేయబడ్డ మనుషులం!

మేము మనుష్యులుగా ఎవరికీ అక్కరలేదు. "గుమాస్తా"గా ప్రతివాడికీ మేము అవసరం. ఇదీ మా విలువ!

నిజానికి మా విలువ నెలకి నూటపాతిక క్రింద తేల్చారు.

నెలరోజులనుండి కష్టపడి చేసినందుకు కాదు. ప్రతిఫలంగా కాదు, ఆ బండచాకిరీ చేసినందుకు కాదు, అయస్కాంతం మట్టిలోని ఇనుమును ఆకర్షించుకున్నట్లుగా లోకంలోని దుఃఖాలని, బాధలని మా వైపు ఆకర్షించుకొని నెలరోజులపాటు భరించినందుకు కాదు. కృతజ్ఞతగా కాదు, జాలిపడీ కాదు, ఆ నూటపాతిక రూపాయలు మాకు ఇవ్వటం–మేము ఈ లోకం నుండి నిష్క్రమిస్తే వీటిని భరించేవారుండరు. కనుక మరుసటి నెల వాటిని భరించేందుకు, మమ్మల్ని చావకుండా బ్రతకమని 'దానం' చేస్తారు ఆ డబ్బు.

జీవితం అనిత్యమని తెలిసినా మానవ సహజమైన బ్రతుకుమీది ఆశ (మిగతా మానవులకూ, మాకూ పోలిక వున్నది ఆ లక్షణంలోనే) వలన ఆ డబ్బుకే మేము అమ్ముడు పోతాము.

అదే మాలో గొప్పతనం!

ఈ, మా గొప్పతనాన్ని రోజూ మామీద ఎగిరిపడే ఆఫీసరు గ్రహించడు; సమయానికి డబ్బివ్వలేదని ఎగిరిపడే పెరుగువాళ్ళు, పాలవాళ్ళు గ్రహించరు. క్రిందటినెల బాకీ తీర్చనిదే ఈ నెల బాకీపెట్టనని పేచీపెట్టే చిల్లరకొట్టు శెట్టి గ్రహించడు. ప్రక్కింటి రామారావుగారు పెళ్ళాం కొనుక్కున్న చీరెలాంటిది కొనిపెట్టమనే భార్యామణీ గ్రహించదు.

ఊహించగల శక్తిగల వీళ్ళందరూ గ్రహించని మా గొప్పతనానికి అసలు పేరు "బాధలు". ఈ బాధలనే ఇంకా వూహ తెలియని (పాలకోసం ఏడ్చే) పసిపిల్ల, పగిలిపోయిన పలకచూపి కొత్తది కొనిపెట్టమని ఏడ్చే ఎడపిల్ల వెధవ ఏమి గ్రహించగలరు?

"లా" ప్రకారం అందరు గుమస్తాలకుమళ్ళే నాకూ ఉన్నాయి ఈబాధలు.

నలుగురు పిల్లలు (పెళ్ళిళ్ళు అయి

పోయిన హారుకాక), భార్య, అశక్తులైన ముసలి తల్లిదండ్రులు, నేను-ఇదీ మా కుటుంబ స్థిర జనాభా.

మేము కాక అదనంగా కొసరు వెధవల్లాగా వచ్చిపడే చుట్టాలు జనాభా సంఖ్యను పెంచుతుంటారు.

నా నూట పాతిక ఇంతమంది అవసరాలను, ఆకలిని తీర్చాలి!

ఈ జీవితంలో ఏమీ చెయ్యలేక (అప్పులు తప్ప) నిశ్చేష్టుడనై పోతాను అప్పుడప్పుడు.

ఈ జీవితం నరకం!

ఈ బ్రతుకు నిస్సారం, నిర్జీవం!!

నిస్సత్తువతో నడవలేక నడిపే ఈ జీవన నౌకకు వాలు ప్రవాహం ఎన్నడూ లేదు. ఈ ఎదురు వాలులో, ఎదురు గాలిలో ఇలా ఇంకా ఎన్నాళ్లు ఈ నావను నడపాలో?

"హే భగవాన్!"

ఒక్క క్షణం అయినా స్వచ్ఛమైన గాలి పీల్చుకోవటానికి వీలులేని ఈ జీవనపు 'గని'లో ఎలా పనిచెయ్యటం?

పూర్వాశ్రమంలో కాలేజీ జీవితం, ఆనాడు భవిష్యత్తును గురించి కన్న బంగారు కలలు, ఈ జీవితంలోని బాధల నీడలు లేశమైనా విడవని తెల్లని తెరవంటి నిర్మలమైన యువక మనస్సు... అవన్నీ ఈ నాటికి, కలలో కూడా వూహించని ఈ భవిష్యత్తుకి జీవితంలో లేదనకుండా రుచి చూపించబడిన ఆనందం యొక్క స్మృతులుగా మాత్రం మారిపోయాయి.

అవి మనస్సులో ప్రవేశించినంత ఒక్క క్షణం మాత్రం ఈ జీవితం తాలూకు బాధల నుండి తప్పించుకున్నట్లు సంతోషం కలుగుతుంది.

అంతే!

మరుక్షణం ఎదురుగా "చిరుగుల బొంత" లాంటి ఈ ప్రస్తుతపు జీవితం సాక్షాత్కరిస్తుంది.

నిత్యం దెబ్బలు తినే శరీరం మొద్దుబారినట్లు బ్రతికివున్న ప్రతి క్షణం వుండే ఈ బాధలు అలవాటు పడిన తరువాత నా మనసు నేమీ కదల్చలేకపోతున్నాయి.

ఈ వుద్యోగం వచ్చినపుడు కలిగినంత దుఃఖం ఈనాడు లేదు.

ఈ వుద్యోగం వచ్చినందుకు ఎందుకు సంతోషించాలో అర్థంకాలేదు నాకు. విశ్రాంతిలేని కాలచక్రంలాంటి ఈ గుమస్తాగిరిలో ప్రవేశించే సమయంలో నాకు సంతోషంకన్న విచారమే ఎక్కువ కలిగింది.

ఆ క్షణంలో అనిపించింది నాకు ఇలా:

"అయిపోయింది. జీవితం అయిపోయింది. విశ్రాంతి కాని, సంతోషం కాని ఈనాటితో సరి. గానుగ ఎద్దులా ఒక పరిధిలోనే తిరుగుతూ, అలసిపోతూ, విశ్రాంతికి నోచుకోక అలమటించే ఈ వుద్యోగం సంతోషదాయకమేమీ కాదు. ఈనాటి వరకు గడపిన జీవితం తాలూకు స్మృతులే భవిష్యత్తులో కలిగే సంతోష సంఘటనలు, సన్నివేశాలు..."

ఆనాటినుండి ఈనాటివరకు అనుభవించిన ఈ ఇరవై సంవత్సరాల జీవితం కేవలం ఎండిపోయిన బీడులాంటిది

మాత్రమే. నేల అడుగున ఎక్కడో వుండే నీటివూటలాంటివి నా గత జీవిత స్మృతులు.

పట్టాలమీద గాడి తప్పకుండా తిరుగుతుండే చక్రాలవలన నడిచే రైలు బండీ లాంటిది నా జీవితం.

స్టేషన్, తరువాత స్టేషన్ – పోతూనే వుంటుంది కొంతదూరం ప్రయాణం, మళ్ళీ వెనుకకు తిరగటం – మళ్ళీ స్టేషన్ తరువాత స్టేషన్, ఆగటం వుండదు. విశ్రాంతి వుండదు.

ఈ జీవితం ఇంతే!.

నెలలో మొదటిరోజు ...

క్రిందటి నెలంతా కష్టపడి చేసిన ఖర్చులు, అప్పులు సర్దుకునేసరికి చేతిలో రాగిపైసాకూడా మిగలదు. మనసు శూన్యం అయిపోతుంది. ఆ శూన్యంలోకి ఆ నెలంతా గడపటం కోసం ఎలా అప్పు చెయ్యాలా ? అన్న ఆలోచన ప్రవేశిస్తుంది. దాని వెనుకనే అనేక వుపాయాలు ప్రవేశిస్తాయి. ఇవన్నీ చేసే గడబిడను తట్టుకోలేక ఏ వంటరి ప్రదేశానికైనా పరుగెత్తి కనబడని దేవుడిని గురించి ఒక కేక వేద్దా మనిపిస్తుంది.

పిల్లల జీతాలు, ముసలాళ్ళ డాక్టరు ఫీజులు, పెళ్ళాం అర్థంలేని కోరికలు, నా తప్పని అవసరాలు, చుట్టాల బెడద, పెద్దధాని పురుడో లేక ... ఈ జాబితా ఇలా వ్రాసుకుంటూపోతే పెద్దదవుతూనే వుంటుంది. వీటిని తీర్చలేక పడేబాధ, అప్పులబాధ ఇవన్నీ కలసి మనిషిని నెల చివరికి వచ్చేసరికి ఆరిపోబోతున్న దీపంలా చేసి వేస్తాయి.

కాలండర్‌లో 30 వ తారీఖు!

అప్పుడు కొంచెం ప్రాణం తేరుకుంటుంది. మర్నాడు వచ్చేజీతం గురించి అర్థంలేని కలలు, ఆశలు ... ...

రెండురోజుల ఆలస్యంతోవచ్చే ఆ జీతం చేసిన అప్పులు మూడు వంతులు కూడా తీరటానికి సహాయపడవు. దానిని గురించిన కలలను, ఆశలను ధ్వంసంచేసి నిస్పృహను మిగిల్చి మాయం అవుతుంది.

మళ్ళీ నెల మొదలు.

నెలాఖరున బాధలు.

నెల మొదట (ఆలశ్యంగా) వచ్చే జీతం.

జీవితానికి చాలని జీతం!

నా దినచర్యలాంటి ఈ చక్రభ్రమణం అనంతంగా సాగిపోతూనే వుంటుంది.

నా దినచర్య అనేమిటి, మా జాతి జీవులందరి జీవితాలు, దినచర్యలు అంతే.


అనంతమైన చక్రభ్రమణం!

అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడ్ని తిట్టుకుంటూ ఉదయంలేవటంతో నా దినచర్య ప్రారంభం అవుతుంది.

ఆఫీసుకు బయలుదేరే సమయానికి ఇంట్లో దాదాపు కురుక్షేత్ర సంగ్రామ సన్నాహాలు జరుగుచున్నంత సందడి వుంటుంది.

హడావుడిగా నాలుగు మెతుకులు కొరికి బయలుదేరి ఆఫీసుకు చేరేసరికి అరగంట ఆలస్యం అని సూచిస్తుండటం ఆఫీసు గడియారానికి అలవాటే!

ఆ తరువాత తప్పకుండా ఆఫీసర్




తిట్లు, సంజాయిషీ యిచ్చుకోవటం, 'రేపటినుండి ఇలా వస్తే సస్పెండే' అన్న ఆయన బెదిరింపులు, తల వంచుకు బయటుకు రావటం – తప్పని పనులు.

సాయంకాలం ఆఫీసు వదితే లోపల మరి రెండుసార్లు అక్షింతలు, ఆరింటికి ఇంటికి వస్తూ ఆనాడు పూర్తిచెయ్యలేకపోయిన ఫైల్స్ ఇంటికి మోసుకు రావటం – ఇవికూడా నా దినచర్యలో 'డిటోలు' పెట్టదగిన పనులే.

విసుగ్గా, చికాకుగా ఇంటికి చేరుకోవటం నాకు ఇరవై ఏళ్ళనుండి వస్తున్న అలవాటు.

రాత్రిపూటకూడా వెట్టిచాకిరీ, ఎప్పుడో పన్నెండుకో, వంటిగంటుకో నిద్ర.

నడుం వాల్చిన కాస్సేపటికే "గుమాస్తా"లాగా తయారవుతాడు విసుగులేకుండా ఆ సూర్యుడు.

మళ్ళీ ఆఫీసుకు సన్నాహాలు.

ఇట్లాగే జీవితంలోకూడా రొటీను.

ఈ గానుగ ఎద్దు జీవితం ఎప్పుడు పోతుందా అని నిరీక్షణ.

ఇది సాల్వ్ చెయ్యలేని ప్రాబ్లమ్.

మా జీవితం ఒక వింత గేమ్.

మేము వింత కీటకాలము.

సుఖాల ప్రాంతాల నుండి వెలివేయబడ్డ వింత, విచిత్రమైన జాతి వాళ్ళం.

ఈ భూమి. కాల చక్రం –మమ్మల్ని పోలినవే: విశ్రాంతిలేని చక్రభ్రమణం!!

"భగవాన్ !"

ఈ జీవితం భరించ లేకుండా వున్నాను. విసుగు జనిస్తోంది. ఇంతకన్న ఏ జంతువులలోనన్నా పుట్టించి పుణ్యం కట్టుకోరాదా ?

"అన్యధా శ్శరణం నాస్తి,
త్వమేవశరణం మమ".

★